క్లుప్తంగా

వైభవంగా తిరుమంజనోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి తిరుమంజనోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఉదయం బిందెసేవ, అష్టోత్తర నామార్చన, అభిషేకాలు చేపట్టారు. అనంతరం మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక, నిత్య పూజలు చేసి విశేషంగా అలంకరించి దేవేరులతో కలిపి కల్యాణమండపంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదమంత్రాలతో తిరుమంజోత్సవం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య మహారాజ్ జయంతి



ఏకలవ్యుడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలో బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏకలవ్య మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ఏకలవ్య కాలనీ బోర్డు ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎరుకల వీరేశ్ మాట్లాడుతూ ఆ మహానీయుడిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు చిన్న సవారప్ప, సభ్యులు ఎరుకుల లక్ష్మన్న, ఈరన్న, గోపాల్, నాగేష్, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

హొళగుంద, హెబ్బటంలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు

హొళగుంద: హొళగుంద, హెబ్బటం గ్రామాల్లో బుధవారం సర్పంచు రంగమ్మ, కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మొహర్రం వేడుకలతో పాటు వర్షా కాలం కావడంతో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టారు. హొళగుందలో పీరులు ఊరేగే కోటవీధి, ఈర్లకట్ట, ఆయా ప్రధాన వీధులు, పీర్ల చావిడిల వద్ద చెత్త చెదారం, మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. అలాగే మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి లీకేజీలను అరికట్టారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని పురాతన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అమరావతి శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో అర్చకులు సత్యనారాయణ స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిపించారు. ఆలయ నిర్వాహకులు అడ్వకేట్ సత్యనారాయణ, అమరావతి మహేష్ పాల్గొన్నారు.

ఆలూరులో డీఎస్పీ పర్యటన

ఆలూరు: మొహర్రం వేడుకలను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మంగళవారం అర్ధరాత్రి ఆలూరులోని పీర్లు చావిళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన భక్తులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని మత పెద్దలకు సూచించారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో వేడుకల నిర్వహణ, బందోబస్తుపై ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.

ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని లాల్‌మాన్‌పల్లె గ్రామంలో పొలంలో గొర్రెలు మేపుతున్నారనే విషయంలో జరిగిన ఘర్షణలో షేక్ రజాక్ మియా ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బోయ ఎల్లరాముడు, బోయ విష్ణువర్ధన్, బోయ నాగన్న, పెద్దొడ్డికి చెందిన కేశన్నపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలిపారు. అలాగే బోయ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు మదార్‌బాషా, రజాక్ మియా, హసన్ వలి, షబ్బీర్ బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఏవైనా సమస్యలుంటే స్టేషన్‌లో తెలియజేయాలని, అలా కాకుండా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



గుండ్లకొండలో పీర్లను ఏటికి తరలిస్తున్న దృశ్యం,



ఆకట్టుకున్న వేషధారణలు



గూళ్యంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం





ఆస్పరిలో ఊరేగుతున్న పెద్దపీర్లు, శంకరబండలో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు

ముగిసిన మొహర్రం

- బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగిన పెద్దసరిగెత్తు
- సాయంత్రం అశేష భక్తజనం మధ్య ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిన పీర్లు
- ఆకట్టుకున్న యువకుల వేషధారణలు

విద్యుద్దీపాల వెలుగుల్లో పీర్లచావిళ్లు..
కొలువుదీరిన పీర్లు..
అడుగుపెడితే అత్తరు సుగంధం..
భక్తిపారవశ్యంతో కులమతాలకతీతంగా
బారులు తీరిన భక్తులు..
వారికి ముజావర్ల నెమలి పింఛంతో
ఆశీర్వాదాలు..
మండే అగ్ని గుండంలో ఎగిసిపడే
నిప్పురవ్వలు..
రాత్రంతా యువత సాహుసేన్ కేరింతలు..
తెల్లవారుజామున పీర్ల అగ్నిగుండ ప్రవేశం..
చూసేందుకు తరలివచ్చిన జనం..
పులివేషధారణతో అలరించిన యువత..
ప్రీతిపాత్రంగా పీర్లకు కానుకల సమర్పణ..
బుధవారం పీర్ల చివరి ఊరేగింపు..
బాధాతప్త హృదయాలతో భక్తుల వీడ్కోలు..
– పత్తికొండ రూరల్



గుడెమిరాళ్ల పీర్లు గుండ్లకొండకు వచ్చిన దృశ్యం



హొళగుందలో పీర్ల జలధికి తరలి వచ్చిన భక్తులు



పత్తికొండలో పీర్ల ఊరేగింపు



తుగ్గలిలో పీర్లను జలధికి తరలిస్తున్న భక్తులు



ఆలూరులో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు



ఆలంకొండలో పీర్లను ఏటికి పంపేందుకు ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు మండల కేంద్రం తుగ్గలితో పాటు పలు గ్రామాల్లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. తెల్లవారుజామునే పీర్లను గ్రామాల్లో మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగించారు. సాయంత్రం పీర్ల చావిళ్ల నుంచి పీర్లను జలధికి తీసుకెళ్లారు. భక్తులు బెల్లం ఉంటలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పగిడిరాయి, పీ.కొత్తూరు, కడమకుంట్ల తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆలూరు రూరల్: కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలు బుధవారం నిమజ్జనంతో ఘనంగా ముగిశాయి. ఆలూరు, హత్తిబెళగల్, మొలగవల్లి, అరికెర,కాత్రికి, కమ్మరచేడు,కురుకుంద,పెద్దహోతూరు తదితర గ్రామాల్లోని పీర్ల చావిళ్లల్లో కొలువైన పీర్లకు వారం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 4 చావిళ్లల్లో కొలువైన పీర్లను ఊరేగింపుగా స్థానిక చెరువు కట్ట వరకు తరలించి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. పీర్ల ఊరేగింపును తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

హాలహర్వి: మండలంలోని హాలహర్వి, చింతకుంట, కామినహాల్, గూళ్యం, సిద్ధాపురం, బాపురం తదితర గ్రామాల్లో బుధవారంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. పీర్లను బుధవారం సాయంత్రం ఏటికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరేంద్ర పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హాలిగేర, చిరుమాన్‌దొడ్డి, ములుగుందం, బిల్లేకల్లు, కై రుప్పల, తంగరడోణ తదితర గ్రామాల్లో బుధ వారం మొహర్రం వేడుకలు ముగిశాయి. మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, కైరుప్పల, ములుగుందం, డి.కోటకొండ గ్రామాల్లో యువకులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆస్పరిలో పెద్ద పీర్లను మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు పీర్లకు బిందెలతో నీళ్లు పోసి పూజలు చేశారు. స్థానిక పెద్ద బావి వద్ద నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆస్పరి సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

హొళగుంద: మండలంలో మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లకు భక్తులు ఉదయం నుంచి తమ కానుకలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తు అనంతరం సేద తీరిన పీర్లు బుధవారం సాయంత్రం పీర్ల చావిళ్ల నుంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్లారు. భక్తుల మొగలాయి మధ్య పీర్లు వీధుల్లో ఊరేగించారు. యువకులు, చిన్నారుల పులి వేషాలు ఆకట్టుకున్నాయి. పలువురు పలు హాస్య వేషధారణలతో జనాలను కడుపుబ్బ నవ్వించారు. ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు, సీఐ శేషయ్య, ఇతర మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. చివరి రోజు పలు గ్రామాల్లో పోటు వేషధారణలతో కళాకారులు ఆలరించారు. సాయంత్రం అన్ని గ్రామాల్లో పీర్ల గుండాలను పూడ్చి స్వాములను గ్రామాల్లో ఊరేగింపుగా ఏటికి పంపారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఆయా మండలాల ఎస్‌ఐలు ఖాజావలి, సునీల్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మద్దికెర : మండలంలోని మద్దికెర, హంప, పెరవలి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం జలధితో ముగిశాయి. పీర్లను సాయంత్రం ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. పీర్ల నిర్వాహకులు పీర్లకు షాహదత్ (శుద్ధి) చేసి ముస్లింలు విషాదంగా వచ్చారు.



మద్దికెరలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



హొళగుందలో ఊరేగుతున్న పీర్లు



వెల్దుర్తిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం,







గుండ్లకొండలో సాహుసేన్ ఆడుతున్న యువకులు, వెల్దుర్తిలో పోటు వేషధారణలో యువకుల విన్యాసం, పత్తికొండ చావిడిలో నెమలి పింఛంతో ఆశీర్వదిస్తున్న ముజావరు

బీమా భారం.. రైతుదేనా!

- పంటల బీమా ప్రీమియం చెల్లింపుపై విధి విధానాలను వెల్లడించని ప్రభుత్వం
- గడిచిన ఐదేళ్లలో చెల్లించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు
- పాత విధానం అమలు యోచనలో కూటమి సర్కారు
- నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 82,134 వేల హెక్టార్లలో పంటల సాగు

సాగు చేసిన పంటలు కోల్పోతే రైతులు నష్టపోకుండా ఆదుకునేందుకు గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంటల బీమా అమలు చేసింది. ఇందుకు రైతు తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వచ్చినా కూటమి ప్రభుత్వం పంటల బీమా విధివిధానాలను వెల్లడించ లేదు. దీంతో బీమా ప్రీమియం చెల్లించకపోతే, పంటలు నష్టపోతే పరిహారం అందకపోయే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆలూరు మండలం అరికెర గ్రామ పొలాల్లో సాగు చేసిన పత్తి పంట

ఆలూరు రూరల్: రైతన్నలకు కష్టాలు మళ్లీ మొదలు కానున్నాయా? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అలాగే కనిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రైతులకు గత ప్రభుత్వం కంటే ఎక్కువ మేలు చేస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు రైతులకు చుక్కలు చూపిస్తోంది. రైతు భరోసా పథకం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన హామీకి ఇంతవరకు అతీగతీ లేదు. దీంతో పంటల సాగుకు ఆర్థిక ఇక్కట్లతో అందిన చోటల్లా చేతులు చాచాల్సిన దుస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకు అన్నీ వారి చెంతకే అందించింది. పంట పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 సాయం అందించింది. సాగుకు ముందుగానే మే నెలలో రైతుల ఖాతాలో కొంత నగదు చేసేది. ఆ మొత్తం వారి అవసరాలను కొంతమేర తీర్చేది. ఇక పంటల బీమా ప్రీమియం కూడా రైతుల తరఫున నాడు ప్రభుత్వమే చెల్లించింది. ఇందుకు ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించింది. పంట నష్టం జరిగితే బీమా పరిహారాన్ని కూడా సకాలంలో అందజేసి అండగా నిలిచింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు పంటల బీమా ఊసెత్తక పోవడం, ఓ వైపు ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకోవడంతో ఏమి చేయాలో రైతులకు పాలుపోవడం లేదు. ఒకవేళ వాతావరణ పరిస్థితులతో పంట నష్టపోతే బీమా వర్తించకపోతే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ ఏడాది 82,134 వేల హెక్టార్లలో పత్తి, వేరుశనగ, ఉల్లి, మిరప,కంది వంటి తదితర పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

నాడు టీడీపీ పాలనలో ఇలా..

కొద్ది రోజుల క్రితం నిర్వహించిన వ్యవసాయ అధికారుల సమావేశంలో పంటల బీమాపై ప్రస్తావన వచ్చింది. పంట బీమా ప్రీమియం పాత విధానంలోనే అమలు చేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు స్పష్టత కొరవడింది. పాత విధానం అంటే.. గతంలో టీడీపీ హయాంలో రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించేవారు. అయితే ప్రస్తుతం ప్రీమియం చెల్లించాలంటే తమకు భారమవుతుందని కర్షకులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

రైతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును గుర్తు తెచ్చుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత పంటల బీమాను గత ఐదేళ్లు ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేసింది. పంటల బీమాకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన పూర్తి ప్రీమియాన్ని ఏటా ప్రభుత్వం కోట్ల రూపాయల్లో చెల్లించేది. పంట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుంటే చాలు ఈ–కేవైసీ అయిన పంటకు ప్రభుత్వం పంట బీమా ప్రీమియం చెల్లించేది. ఏదైనా విపత్తు వచ్చి పంట నష్టం జరిగితే పంట దెబ్బతిన్న రైతులందరికీ బీమా సొమ్ము అందేది.

బీమా కింద రూ.78.79 కోట్లు చెల్లింపు

నియోజకవర్గంలో 2019 నుంచి 2022–23 వరకు పంటలు నష్టపోయిన 65,584 మంది రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.78.79 కోట్లు పంటల బీమా కింద చెల్లించింది. పత్తి,ఉల్లి,వేరుశనగ, మిరప తదితర పంటలు, ఉద్యాన పంటలకు వైఎస్సార్ పంటల బీమా అమలు చేసింది.

బీమాపై స్పష్టతనివ్వాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 7 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. విత్తనం వేసి 20 రోజులు కావస్తోంది. సరైన వర్షాలు లేవు. గతంలో పంటలు వేసిన సమయానికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటకు ఇన్సూరెన్స్ చేయించింది. పంట నష్టం వాటిల్లిన వెంటనే పరిహారం ఇచ్చింది. ప్రస్తుతం ఖరీఫ్ విత్తు సమయం ముగింపు దశకు చేరుకున్నా పంట బీమాపై స్పష్టత లేదు. ప్రీమియంపై ప్రభుత్వం ప్రకటన చేయాలి. బీమా లేకపోతే రైతులు ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి ఏర్పడుంది. – వీరభద్రి, రైతు,గోనేహాల్ గ్రామం

గతంలో ప్రభుత్వమే చెల్లించింది



గడిచిన ఐదేళ్లలో పంటల బీమా ప్రీమియం చెల్లింపు విషయంలో మాకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. ఖరీఫ్,రబీ సీజన్‌లో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేంది. పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్ నగదు ఖాతాలో జమ చేసంది. ప్రస్తతం పంట బీమా విధివిధాలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం ఆందోళన కలిగిస్తుంది. బీమా లేకపోతే వాతావరణ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోతే రైతు భారీగా నష్టపోతాడు.
– ఉరుకుందు,రైతు,మొలగవల్లి

నిబంధనలు రాలేదు



పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం నుంచి నియమ నిబంధనలు ఇంకా రాలేదు. గైడ్‌లైన్స్ వచ్చిన తర్వాత వాటి ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తాం. గత ప్రభుత్వం చేసిన విధానాలను అమలు చేస్తే రైతులకు ప్రీమియం భారం ఉండదు. నియోజకవర్గంలో 82,134 హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశముంది.
– సునీత,ఏడీఏ,ఆలూరు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మంచినీటి బోరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి కట్టడికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశించారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో గ్రామస్తులు మంచం పట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరం, పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఇప్పుడిప్పుడే గ్రామస్తులు వ్యాధి నుంచి బయటపడుతున్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. మంచినీటి బోరు, పరిసరాలు, వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు.

జీవో 117ను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించిన జీవో నంబర్. 117ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం తమ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50,577 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి మెగా డీఎస్సీ అనడం సరికాదన్నారు. తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులన్నిటికి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు.



విన్నూత్నం..

ప్రతి రైతులోనూ ఓ శాస్త్రవేత్త ఉన్నాడు. శ్రమ, సమయం మిగిలించుకునేందుకు నిత్యం ఏదో ఒక కొత్త ఆవిష్కరణ చేస్తుంటాడు. అయితే అవి వారి వరకే పరిమితమవుతుండటంతో జనబాహుళ్యంలోకి రావడం లేదు. ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోయింది. అయినా యంత్రాలకు నాటు పద్ధతిని జోడించి వ్యవసాయం చేయడం నూతన ఆలోచనే. రాతన సమీపంలో ఓ రైతు తన పొలంలో కంది పంట సాగు చేశాడు. పంటలో కలుపు మొక్కలు తొలగించేందుకు బాడుగ ట్రాక్టర్‌కు గుంటకతో పాటు ఇరువైపులా రెండు దంతలు ఏర్పాటు చేసి కలుపు తొలగించారు. సాధారణంగా కాడెద్దులతో ఇలా చేస్తారు. ప్రస్తుతం ట్రాక్టర్‌తో చేసి పనికి, కాడెద్దులతో చేసేందుకు ఒకే ఖర్చు అవుతుండటం, కాడెద్దులతో ఇలా చేయాలంటే రోజంతా పడుతుందని, ట్రాక్టర్‌తో అయితే కొన్ని గంటల్లో పూర్తవుతుందని రైతు పేర్కొన్నాడు.
– తుగ్గలి